# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం | 21 జూలై 2024 | పేజీలు 8


## మేడ్చల్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలను..
# సందర్శించిన కలెక్టర్ గౌతమ్..

- ఐటిఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్‌మెంట్‌పై కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్..
- ట్రేడ్లలోని ట్రైనీలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉపాధి అవకాశాలపై కలెక్టర్‌కు వివరించారు..
- మహిళ సాధికారతకు మేడ్చల్ ఐటిఐ కృషిని కలెక్టర్ అభినందించారు..



-3 లో



-2లో

# ప్రజాపాలన కేంద్రాన్ని.. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

- ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలన్న కలెక్టర్ గౌతమ్..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలన కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు..
- గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 20:** ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను, అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు.. శనివారం మేడ్చల్ జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాల కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ప్రజాపాలన కేంద్రంలో నమోదైన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ప్రజా పాలనలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డేటా విభాగంలో ఎప్పటి కప్పుడు ఎంట్రీ చేయాలన్నారు.. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందించిన గృహజ్యోతి,మహాలక్ష్మి (గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

## 1.50 లక్షల కోట్లతో మూసీ అభివృద్ధి ..
# టూరిజం హబ్ గా హైదరాబాద్

- ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రం చేస్తం
- గోపన్ పల్లిలో ఎకరం రూ.వంద కోట్లు
- ఐటీ ఫార్మా సంస్థలతోనే భూముల ధర పెరిగింది
- ఇక్కడికి ఎవరొచ్చినా అక్కున చేర్చుకుంటం
- జంటనగరాల అభివృద్ధి కోసమే హైడ్రా వ్యవస్థ
- గోపన్ పల్లి ఫ్లై ఓవర్ ప్రారంభించిన సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:**విశ్వనగరంగా హైదరాబాద్ ను తీర్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇవాళ గోపన్ పల్లి ఫ్లై ఓవర్ ను సీఎం రేవంత్ ఎడ్డి ప్రారంభించారు. జెండా ఊపి ఫ్లై ఓవర్ పైకి ఉమెన్ బైకర్ ను అనుమతించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మూసీ రివర్ డెవలప్మెంట్ కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.

-2 లో

# పాఠశాలల వేళలను మారుస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు

- ప్రాథమిక పాఠశాలలకు అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సమయం మార్పు
- అరగంట ముందుకు జరిపిన తెలంగాణ విద్యాశాఖ
- హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో పాత పనివేళలు కొనసాగుతాయని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** పాఠశాలల వేళలను మా రుస్తూ తెలంగాణ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సమయాలను మార్పు చేసింది. ఉన్నత పాఠశాల సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు మారుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పనివేళలు ఉండేవి. ఇప్పుడు ఉదయం అరగంట సమయాన్ని ముందుకు జరిపి, సాయంత్రం కూడా ముందుకు జరిపింది.అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అమలులో ఉన్న పని వేళలు కొనసాగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక్కడ పాఠశాలలు ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్నాయి.

-2 లో

# రుణమాఫీపై అపోహలు వద్దు... క్లారిటీ ఇస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:**రుణమాఫీపై రైతులకు ఎలాంటి అపోహలు వద్దన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి రైతు అకౌంట్ నంబర్లు తమ దగ్గర ఉన్నాయని తెలిపారు. రుణమాఫీ కాని వారికి ఎందుకు కాలేదో..ఎప్పుడు అయితుందో క్లారిటీ ఇస్తామన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ అందరికీ అవుతుందని తెలిపారు. ప్రతి రైతు కుటుంబాన్ని రుణవిముక్తి

# ప్రజాపాలన కేంద్రాన్ని.. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..





## అమ ఆదర్శ పాఠశాలలో పనుల పరిశీలన..

అనంతరం మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలను (బాలికల ) కలెక్టర్ గౌతమ్ సందర్శించారు..! అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పాఠశాలలో మీ పిల్లలకు ఉపాధ్యాయులు చదువు ఎలా చెపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.. నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్స్ మీ పిల్లలకు, అందాయా లేదా అని అడిగారు.. మధ్యాహ్నం భోజనం నాణ్యతతో పిల్లలకు అందిస్తున్నారా అని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగారు.. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.. మీ పిల్లలను స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత బాధ్యత తీసుకొని పిల్లలను చదివించాలన్నారు.. పిల్లలు మంచిగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు..ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దిలీప్ కుమార్, మేడ్చల్ ఎమ్మార్వో శైలజ, జిల్లా విద్యాధికారి విజయ కుమారి,ఎంపీడీవో వసంత లక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు..





# 1.50 లక్షల కోట్లతో మూసీ అభివృద్ధి ..

# టూరిజం హబ్ గా హైదరాబాద్

- మొదటి పేజి తరువాయి

మూసీ అంటే ముక్కు మూసుకొనే పరిస్థితి ఉందని, వచ్చే ఐదేండ్లలో ప్రపంచ స్థాయి పర్యాటకులు వచ్చి దర్శించుకునేలా చేస్తామని చెప్పారు. ఇందుకోసం మూసీ అభివృద్ధి బాధ్యతను తానే తీసుకున్నానని అన్నారు. వచ్చే ఐదేండ్లలో 1.50 లక్షల కోట్లు ఖర్చు చేసి మూసీ నదిని లండన్ లోని థేమ్స్ రివర్ లా అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. మూసీ అభివృద్ధిని చూడగానే ప్రజాప్రభుత్వం గుర్తుకు వచ్చేలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణకు వచ్చే ఆదాయంలో 65 శాతం జంటనగరాలదేనని అన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన వారిని అక్కున చేర్చుకుంటున్నామని చెప్పారు. ఐటీ, ఫార్మా రంగం అభివృద్ధి వల్ల ఇక్కడ భూముల ధరలు భారీగా పెరిగాయన్నారు. గోపన్ పల్లిలో ఎకరం వంద కోట్ల రూపాయలు పలుకుతోందని చెప్పారు. హైదరాబాద్ కు ఎవరొచ్చిన ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై అపోహలు వద్దు... క్లారిటీ ఇస్తాం

- మొదటి పేజి తరువాయి

చేస్తామన్నారు. రుణమాఫీపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. చారిత్రాత్మకమైన కార్యక్రమంపై బురద జల్లొద్దని చెప్పారు. రుణమాఫీపై రైతులకు ఎవరికి అనుమానాలు ఉన్నా క్లారిఫై ఇస్తామని తెలిపారు తుమ్మల. తెలంగాణ ప్రభుత్వం జూలై 18న రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిన సంగతి తెలిసిందే. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన 11 లక్షల 50 వేల మంది రైతులకు 6098 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది. లక్షన్నర వరకు జూలై 30 వరకు లక్షన్నర నుంచి రెండు లక్షల రుణాలు ఉన్న రైతులకు ఆగస్టు 15 లోపు రుణమాఫీ పూర్తి చేస్తామని సీఎం రేవంత్ చెప్పిన సంగతి తెలిసిందే.

# మేడ్చల్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలను.. సందర్శించిన కలెక్టర్ గౌతమ్..

## ఐటిఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్‌మెంట్‌పై కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

## ట్రేడ్లలోని ట్రైనీలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉపాధి అవకాశాలపై కలెక్టర్‌కు వివరించారు..

## మహిళ సాధికారతకు మేడ్చల్ ఐటిఐ కృషిని కలెక్టర్ అభినందించారు..





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 20:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని, మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించారు.. శనివారం ఐటిఐని సందర్శించి ఐటిఐ లోని కోపా, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్, టర్నర్ మరియు వెల్డర్ ట్రేడ్‌ల్లో ట్రైనింగ్ మరియు ఐటిఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ వివరించారు. వివిధ ట్రేడ్లలోని ట్రైనీలకు ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల్లోని ఉపాధి అవకాశాల గురించి కలెక్టర్‌కు తెలియజేశారు.. మేడ్చల్ జిల్లాలో అప్రెంటిస్ షిప్ కన్వీనర్‌గా మేడ్చల్ ఐటిఐ వ్యవహరిస్తుందని ప్రతి సంవత్సరం 1800 మందికి పైగా ట్రైనీలు అప్రెంటిస్ షిప్ పూర్తి చేసుకుంటున్నారని కలెక్టర్‌కు ప్రిన్సిపల్ తెలిపారు.. ప్రావీణ్య స్కిల్ డెవలప్‌మెంట్ వారు నిర్వహించిన స్కిల్స్ కాంపిటిషన్‌లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించిన ఐటిఐ విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు.. ఐటిఐలో నూతనంగా ప్రారంభిస్తున్న సేవింగ్ టెక్నాలజీ (టైలరింగ్) మరియు ఫుడ్ టెక్నాలజీ ట్రేడ్ పట్ల కలెక్టర్ ఆసక్తి వ్యక్తం చేశారు. వాటి గురించి ప్రిన్సిపల్ వివరించారు.. మహిళ సాధికారతకు మేడ్చల్ ఐటిఐ కృషిని కలెక్టర్ అభినందించారు. ఐటిఐలోని ఫ్రూట్ మరియు వెజిటేబుల్ ప్రాసెసింగ్ యూనిట్ల గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఔత్సాహిక మహిళలకు ఈ ఇంకుబేటర్ సమర్థత ఇస్తుం దని ప్రిన్సిపల్ కలెక్టర్ కువివరించారు.. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రస్తుత ప్రిన్సిపాల్ హనుమా నాయక్, పూర్వపు ప్రిన్సిపాల్ డి.శైలజ, మేడ్చల్ ఎమ్మార్వో శైలజ, ఎంప్లాయిమెంట్ అధికారి నిర్మల, ఐఐటి సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# ఈ నెల 23 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం.. అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఈ నెల 23 నుంచి బడ్జెట్ సమావేశాలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచరంతో సమాధానాలు పంపాలని అధికారులకు తెలిపారు. బడ్జెట్ సెషన్‌లో గ్యాప్ లేకుండా చూసేందుకు సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 25న ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలిపారు. నోట్ ఆన్ డిమాండ్ రూపొందించి బడ్జెట్‌ను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, కార్యదర్శులు రఘునందన్‌రావు, బుద్ద ప్రకాష్ జ్యోతి, వి కరుణ, లోకేష్ కుమార్, సిఐపిఆర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రారంభం కానుంది. సభ ప్రారంభమైన వెంటనే ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృష్ణణ్ ప్రసంగిస్తారు. మరోవైపు మండలి సమావేశాలు ఈ నెల 24న ప్రారంభం కానున్నాయి.



## తెలంగాణ ఉన్నత పాఠశాలల పనివేళలు మార్పు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ విద్యాశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలు మారుస్తూ ఉత్తర్వుల జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు తెరిచి ఉంటాయని పేర్కొంది. కాగా ఇప్పటివరకు ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలు తెరిచి ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ యువతను మోసం చేశాయి: కిషన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**యూత్ డిక్లరేషన్ పేరుతో రేవంత్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని ఫైర్ అయ్యారు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీని సీఎం మరిచిపోయారని విమర్శించారు. 2లక్షల ఉద్యోగాలు ఎక్కడికి పోయాయో చెప్పాలన్నారు. హైదరాబాద్ ధర్నా చౌక్ లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో పాల్గొన్నారు కిషన్ రెడ్డి. సెక్రటేరియట్ పైరవీలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. కేసీఆర్ మాదిరి సీఎం రేవంత్ కూడా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ లు బదిలీ




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో పలు విభాగాల్లో పని చేస్తున్నఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు రాష్ట్ర ఛీఫ్ సెక్రటరీ శాంత కుమారి శనివారం ఆరుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ ఛీఫ్ సెక్రటరీగా వికాస్ రాజ్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా మహేష్ దత్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీగా డాక్టర్ శరత్, స్పోర్ట్స్ డైరెక్టర్ గా కొర్రా లక్ష్మీ, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీగా హరీష్, మేడ్చల్ మల్కాజ్ గిర అడిషనల్ కలెక్టర్ గా రాధికా గుప్తా లను నియమించారు.

# విద్యుత్ కోసం ఇలాంటి నిరసనలు చూసి యుగాలైంది: కేటీఆర్ ఎద్దేవా

కరెంట్ రావడం లేదంటూ నాగర్ కర్నూల్ జిల్లాలో రైతుల నిరసన

తమ గ్రామానికి, వ్యవసాయానికి కరెంట్ రావడం లేదని సబ్ స్టేషన్‌కు తాళం


ఈ వీడియోలను రీట్వీట్ చేసిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని కరెంట్ కోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో విద్యుత్ కోసం ఇలాంటి నిరసనలు చూసి యుగాలు అయిందని... మార్పు మహత్యం ఇదేనంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఇందుకు సంబంధించి ఓ నిరసనకు సంబంధించిన ట్వీట్‌ను రీట్వీట్ చేశారు. తమకు కరెంట్ రావడం లేదంటూ నాగర్ కర్నూలు జిల్లా తిమ్మాజీపేట మండలం చేగుంట గ్రామంలో రైతులు సబ్ స్టేషన్‌కు తాళం వేసి ధర్నాకు దిగారు. తమ గ్రామానికి, వ్యవసాయానికి కరెంట్ సరిగ్గా రావడం లేదని రైతులు మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిని రీట్వీట్ చేస్తూ కేటీఆర్ కరెంట్ కోతలపై చురకలు అంటించారు.

# నటి శ్రీరెడ్డిపై కర్నూల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు





**హైదరాబాద్ పెన్ పవర్:**టాలీవుడ్ వివాదాస్పద నటి శ్రీరెడ్డిపై కర్నూల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలపై సోషల్మీడియా వేదికగా శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమె చేసిన కామెంట్లపై టీడీపీ నేత రాజు యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యున్నతస్థాయిలో ఉన్న వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా యూట్యూబ్, ఫేస్ బుక్ లో మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కర్నూల్ త్రీటౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద శ్రీరెడ్డిపై కేసు ఫైల్ చేశారు.

# తాండూరులో 7 లక్షల ఫేక్ కరెన్సీ సీజ్





**హైదరాబాద్ పెన్ పవర్:**ఫేక్ కరెన్సీ నోట్ల ముఠాను గుట్టురట్టు చేశారు వికారాబాద్ జిల్లా పోలీసులు. తాండూరులోని 7 లక్షల ఫేక్ కరెన్సీని సీజ్ చేశారు. కంప్యూటర్ సహా..నోట్ల ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 19న తాండూరు రైల్వే స్టేషన్ లో అనుమానంతో తిరుగుతున్న చంద్రయ్య అనే వ్యక్తిని పట్టుకొని విచారించగా.. అసలు విషయం తెలిసింది.

తెలంగాణ, ఆంధ్రాలో నకిలీనోట్లు తయారు చేసి.. మార్కెట్లో సర్క్యులేట్ చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ నోట్ల ముఠా సభ్యుల్లో కొంత మందికి నేరచరిత్ర ఉందని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే కారు ఢీకొని మహిళ మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య కారు ఢీకొని శనివారం ఓ మహిళ మృతి చెందింది. కాజీపేట మండలం మడికొండ దగ్గర రోడ్డు యాక్సిడెంట్ జరిగింది. ఈ ఘటనలో కలకోట్ల స్వప్న(40) అనే మహిళ అక్కడికక్కడే చనిపోయింది. శనివారం రాత్రి మహిళ రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. యాక్సిడెంట్ అనంతరం మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కారు కాజీపేట బాపూజీనగర్ లో వదిలివెళ్లిపోయిన వెళ్లిపోయారు.

## జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వివేక్



**హైదరాబాద్ పెన్ పవర్:**సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ లో జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ ఓపెనింగ్ సెర్మనీ గ్రాండ్ గా జరిగింది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, HCA ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు కార్యక్రమానికి చీఫ్ గెస్టులుగా అటెండయ్యారు.స్పోర్ట్స్ జర్నలిస్ట్ లందరు క్రికెట్ ఆడటం సంతోషంగా ఉందన్నారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఎక్కువ మంది జర్నలిస్ట్ లు క్రికెట్ ని మాత్రమే కవర్ చేస్తున్నారని చెప్పారు. క్రికెట్ తో పాటు అదర్ స్పోర్ట్స్ ని కూడా కవర్ చెయ్యాలని కోరారు. తనను క్రికెట్ లోకి తీసుకొచ్చింది ఎమ్మెల్యే వివేక్ అని చెప్పారు HCA ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు. MLA వివేక్ విలువైన సలహాలు, సూచనలతో క్రికెట్ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. అన్ని జట్లకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

జూలై 20 నుంచి 5 రోజుల పాటు జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ జరగనుంది. V6, వెలుగు తో సహా మొత్తం 10 జట్లు లీగ్ లో పాల్గొంటున్నాయి. లీగ్ లో పాల్గొంటున్న టీంలకు జెర్సీలు అందించారు ఎమ్మెల్యే వివేక్, HCA ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు.

# ఏ పరాయి మహిళతోను నాకు అనైతిక, అక్రమ సంబంధాలు లేవు

### శాంతిని ఇప్పటి వరకు కూతురుగానే భావించానన్న విజయసాయి

### కొడుకు పుట్టాడని చెపితే వెళ్లి పరామర్శించానని వ్యాఖ్య

### మా తాడేపల్లి ఇంటికి వస్తే ఆశీర్వదించానన్న విజయసాయి



**హైదరాబాద్ పెన్ పవర్:**శాంతి అనే ప్రభుత్వ ఉద్యోగినితో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి అక్రమ సంబంధం ఉందనే వార్తలు పెద్ద ఎత్తున ప్రచారమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా విజయసాయి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవాస్తవాలు ప్రసారం చేస్తున్న కొన్ని టీవీ ఛానళ్లు, వాటి ముసుగులో చెలామణి అవుతున్న కొన్ని శక్తులకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం మాత్రం ఉందని చెప్పారు. ఏపీ ఎండోమెంట్స్ ఆఫీసర్ గా ఉన్న శాంతిని 2020 సంవత్సరంలో వైజాగ్ సీతమ్మధార ఆఫీస్ లో మొట్టమొదటగా కలిసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆమెను కూతురుగానే భావించానని... ఒక తండ్రిలా ఏ సహాయం కావాలన్నా చేశానని అన్నారు. తనకు కొడుకు పుట్టాడని చెపితే వెళ్లి పరామర్శించానని తెలిపారు. తమ తాడేపల్లి ఇంటికి తీసుకొస్తే ఆశీర్వదించానని చెప్పారు. ఏ పరాయి మహిళతోను అనైతిక/అక్రమ సంబంధాలు తనకు లేవని స్పష్టం చేశారు. తాను నమ్మిన దేవ దేవులు శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కూడా ఇదే మాట చెపుతానని అన్నారు.

# పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌ను కలిసిన కేటీఆర్, హరీశ్ రావు

### విద్యార్థులపై అప్రజాస్వామికంగా దాడులు చేసి, కేసులు పెట్టారని ఆగ్రహం

### ఉద్యమం సమయంలో ఉన్నటువంటి పరిస్థితులు ఉన్నాయని విమర్శ

### జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీత



**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై బీఆర్ఎస్ బృందం తెలంగాణ గవర్నర్‌ను కలిసి, వినతి పత్రం ఇచ్చింది. గవర్నర్‌ను కలిసిన వారిలో కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అప్రజాస్వామికంగా దాడులు చేశారని, కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమం సమయంలో తెలంగాణలో ఎలాంటి పరిస్థితులు ఉండేవో... ఇప్పుడూ అలాగే ఉన్నాయని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీశారు. గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. అన్యాయంగా తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ధ్వజమెత్తారు.

# హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తుంటే మీకో బ్యాడ్ న్యూస్ బాస్..!

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత ఐటీ దిగ్గజ కంపెనీల్లో ఒకటైన హెచ్?సీఎల్ టెక్ తమ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు కీలక సూచన చేసింది. ఉద్యోగుల లీవ్స్?కు సంబంధించి కొత్త పాలసీని తీసుకొచ్చినట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త విధానంలోని నియమ నిబంధనల ప్రకారం.. హెచ్?సీఎల్ టెక్?లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు వారంలో మూడు రోజులు ఆఫీస్ నుంచి పని చేయాల్సి ఉంటుంది. నెలలో కనీసం 12 రోజులు ఆఫీస్ నుంచి వర్క్ చేయాలి. ఈ రూల్?ను ఉద్యోగులు లైట్ తీసుకుంటే అలాంటి ఉద్యోగులు లీవ్స్ విషయంలో ఇబ్బంది పడతారని హెచ్?సీఎల్ హెచ్చరించింది. ఆ ఉద్యోగుల లీవ్స్?ను ఎలాంటి మొహమాటం లేకుండా కుదించి పారేస్తామని ఉద్యోగులకు క్లియర్ కట్ వార్నింగ్ ఇచ్చింది. నెలకు 12 రోజులు ఆఫీస్?కు రాకపోతే 12కి ఎన్ని రోజులు తగ్గితే అన్ని రోజుల లీవ్స్ కట్ అని కరాఖండిగా ఉద్యోగులకు హెచ్?సీఎల్ చెప్పేసింది.






హైబ్రిడ్ వర్క్ మోడల్?ను అమలు చేసిన ఐదు నెలల తర్వాత హెచ్?సీఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. వారానికి మూడు రోజులు వర్క్ ఫ్రం ఆఫీస్ రూల్?ను ఈ-మెయిల్ ద్వారా హెచ్?ఆర్ ఇప్పటికే టీమ్స్?కు సమాచారం అందించినట్లు ఒక ఉద్యోగి తెలిపారు. ఈ విధానం అమలులోకి రావడం వల్ల లీవ్స్ అయిపోతే లాస్ ఆఫ్ పే ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉద్యోగులకు వస్తుందని సదరు ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ కొత్త పాలసీ అమలుపై హెచ్?సీఎల్ టెక్ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. క్లైంట్ కమిటిమెంట్స్?కు తగినట్లుగా ఈ పాలసీని అమల్లోకి తీసుకొచ్చామని, తమ హైబ్రిడ్ వర్క్ పాలసీ మిడిల్ అండ్ సీనియర్ లెవెల్ మేనేజ్?మెంట్? ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

హెచ్?సీఎల్ సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో, తొలి త్రైమాసికంలో లాభాల బాటలో పయనించింది. తొలి త్రైమాసికంలో రూ.4,257 కోట్ల నికర లాభం హెచ్?సీఎల్ సాధించింది. ఇదిలా ఉండగా.. హెచ్?సీఎల్ మాత్రమే కాదు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం వెసులుబాటును క్రమక్రమంగా తగ్గించేందుకు పలు ఐటీ కంపెనీలు వ్యూహాత్మక నిర్ణయాలను అమలు చేస్తుండటం కొసమెరుపు. 2024 ఆరంభంలోనే కాగ్నిజెంట్ కంపెనీ ఇండియాలో పనిచేస్తున్న తమ ఉద్యోగులు వారంలో మూడు సార్లు ఆఫీస్?కు రావాలని స్పష్టం చేసింది. టీసీఎస్ వేరియబుల్ పే పాలసీని అమల్లోకి తెచ్చింది. ఉద్యోగుల ఆఫీస్ పని వేళలు 60 శాతం కంటే తక్కువగా
ఉంటే వేరియబుల్ పే పొందే అవకాశం ఉండదని పేర్కొంది. 60 నుంచి 75 శాతం ఆఫీస్ అటెండెన్స్ ఉన్న ఉద్యోగులకే 50 శాతం వరకూ వేరియబుల్ పే పొందే అవకాశం ఉందని స్పష్టం చేసింది. డెల్ సంస్థ అయితే ఏకంగా ఉద్యోగుల అటెండెన్స్ ను ట్రాక్ చేయడానికి ఎలక్ట్రానిక్ బ్యాడ్జ్ స్వైప్స్, వీపీఎన్, కలర్-కోడెడ్ సిస్టమ్?ను వాడుతోంది.

## శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి 36 విమానాలు రద్దు






**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ లో ఏర్పడ్డ...సాంకేతిక సమస్యతో దేశంలోని పలు ఎయిర్ పోర్టుల్లో ఇంకా విమానాలు ఆలస్యంగానే నడుస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ లో టెక్నికల్ సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. ప్రధానంగా ఢిల్లీ, ముంబై, చెన్నై, విశాఖ వంటి ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ పోర్టుల సేవలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు
ప్రయాణికులు. శంషాబాద్ ఎయిర్ట్ లోనూ సమస్య ఇంకా అలానే ఉంది. మొత్తం 36 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే మూడు ఫ్లైట్లు, పూణే వెళ్లే రెండు ఫ్లైట్లు, ఢిల్లీకి వెళ్లే రెండు ఫ్లైట్స్, గోవాకి వెళ్లే ఒక ఫ్లైట్, ముంబైకి వెళ్లే మూడు ఫ్లైట్స్, బెంగుళూరు వెళ్లే ఒక ఫ్లైట్, వైజాగ్ కి వెళ్లే రెండు ఫ్లైట్స్ తో పాటు పలు విమానాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు శంషాబాద్ ఎయిర్ పోర్టు అధికారులు. నిన్న మైక్రోసాఫ్ట్ విండోస11,10 ఆపరేటింగ్ సిస్టమ్స్ లో టెక్నికల్ సమస్య ఏర్పడింది. అనేక దేశాల్లోని ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. విమాన, బ్యాంకింగ్ సహా పలు సేవలకు బ్రేక్ పడింది. ఆన్ లైన్ సేవలు, టికెట్ బుకింగ్స్ కు అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ విండోస్ కు సంబంధించిన 365 యాప్స్ సేవల్లో సమస్యలు తలెత్తాయి.

## మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్ రైళ్లపై ఎందుకు లేదు.. అప్‌డేట్ కాలేదా లేక..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా జూలై 19న కొన్ని గంటలపాటు మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వర్లు డౌన్ అయ్యాయి. పలు ఎయిర్ పోర్లు, బ్యాకింగ్ సంస్థలు, స్టాక్ ఎక్ఛ్వేజ్ మార్కెట్ల సేవలు నిలిచిపోయాయి. ఫ్లైట్ క్యాన్సల్ అయ్యాయి. మైక్రోసాఫ్ట్ విండోస్ కు క్రౌడ్ స్ట్రైక్ అనే సెక్యూరిటీ సంస్థ పంపిన అప్ డేట్ కారణంగా సర్వీసులో అంతరాయం ఏర్పడింది. అయితే ఈ ప్రభావం ఇండియన్ రైల్వే సర్వీస్ పై మాత్రం ఏమాత్రం లేదని సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. ఎందుకంటే ఇండియన్ రైల్వేస్ లో బుకింగ్ కౌంటర్లలో టికెట్లు ఇవ్వడానికి 1999 లో డెవలప్ చేసిన %జ=×ూ% ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ను




వాడుతున్నారట. 1999 నుంచి అదే %జ=×ూ% సిస్టమ్ ను అప్ డేట్ చేస్తూ ఇప్పటికీ వాడుతున్నాట. దీని కారణంగానే రైల్వే సర్వీసులపై మైక్రోసాఫ్ట్ క్రాష్ ప్రభావం పడలేదని చెప్తున్నారు అధికారులు.

## ఆర్ నారాయణమూర్తిని ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్

### రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన నారాయణమూర్తి

### నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నారాయణమూర్తి

### అన్ని విధాలుగా అండగా ఉంటామని ఫోన్ చేసి చెప్పిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారు. అన్ని విధాలుగా ఆయనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్ నారాయణ మూర్తి రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. డాక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో ఆర్ నారాయణ మూర్తికి చికిత్స అందిస్తున్నారు. ఆయన క్రమంగా కోలుకుంటున్నట్టు డాక్టర్లు వెల్లడించారు.

# ఆ లింక్ ఓపెన్ చేయొద్దు!



**హైదరాబాద్ పెన్ పవర్:** 'వర్క్ ఫ్రమ్ హోమ్'... కష్టపడకుండా నెలకి రూ.50 వేలు సంపాదించండి! ఫోన్‌లో ఈ మెసేజ్ చూడగానే 'సరే ఎలాగూ ఇంట్లోనే ఉంటున్నా కదా.. ఓ ప్రయత్నం చేద్దా'మని ఆ లింక్‌ని క్లిక్ చేసింది నవ్య. కట్ చేస్తే... సంపాదన మాట అటుంచితే తను దాచుకున్న రూ.ఎనిమిది లక్షలు పోగొట్టుకుంది. ఇంటిపట్టున ఉండే గృహిణులనే టార్గెట్‌గా చేసుకుని ఇలాంటి మోసాలు చాలానే జరుగుతున్నాయి. మరి వీటి బారిన పడకుండా ఉండేదెలా?

రవళి గృహిణి. ఈ నెల 5వ తేదీన ఆమె టెలిగ్రామ్ యాప్‌కి 'వర్క్ ఫ్రమ్ హోమ్' పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేసి వివరాల్లోకి వెళ్తే... స్టార్ హోటల్‌కి సంబంధించిన వీడియోలు చూసి వాటికి మంచి రేటింగ్ ఇచ్చి, లైకులు కొడుతూ, కింద రివ్యూ రాస్తే చాలన్నారు. అలా రాసిన వాటిని స్క్రీన్ షాట్ తీసి పంపితే క్లిప్పింగ్‌కి 50 రూపాయల చొప్పున రోజుకి రెండు వేలు సంపాదించుకోవచ్చని చెప్పి ఆమెని ఓ గ్రూప్‌లో చేర్చారు. ఇచ్చిన టాస్క్‌లు పూర్తిచేయగానే రోజుకి ఐదొందల వరకూ వచ్చాయి. దానికి తోడు ఆ గ్రూపులోని ఇతర సభ్యులు వేలకు వేలు సంపాదించాం అని స్క్రీన్ షాట్లు పెడుతుంటే రవళి కూడా ఆశపడింది. పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ సంపాదించొచ్చన్నారు నిర్వాహకులు. ఇలా మొదట రూ.40 వేలు పెట్టింది. ఆ డబ్బుకు లాభాలొచ్చాయని వాలెట్‌లో డిజిటల్‌గా చూపించారు. అవి చేతికి రావాలంటే మరో నలభై వేలు కట్టాలన్నారు. అలా తను దాచుకున్న ఆరు లక్షల రూపాయలను అకౌంట్ నుంచి పంపించింది. ఇప్పుడు ఫోన్ చేస్తుంటే తీయడం లేదు. మోసపోయానని తెలుసుకుని భర్తతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చింది.

శ్రావణిదీ ఇలాంటి కథే. షాపింగ్ యాప్‌లో చేరి... మరికొందరితో కొనిపిస్తే మీకు రిఫరల్ పాయింట్లు వస్తాయి అంటే తను చేరి, తన అపార్ట్‌మెంట్‌లోని ఫ్రెండ్స్‌ని కూడా చేర్పించింది. వాళ్లంతా కూడా తెలియని లింక్‌లోకి వెళ్లి డబ్బులు పోగొట్టుకున్నారు. ప్రస్తుతం గృహిణులని టార్గెట్‌గా చేసుకుని ఇలాంటి మోసాలే జరుగుతున్నాయని అంటున్నారు సైబర్ నిపుణులు.

**సులభ సంపాదన ఆశ చూపి...**

ఈ నేరాలన్నింటి మోడస్ అపరాండీ(పని తీరు) ఒకే విధంగా ఉంటుంది. సోషల్‌మీడియాలో ఏదో ఒక గ్రూప్‌లో మిమ్మల్ని చేరుస్తారు. మీరు రూపాయి పెట్టకుండా ఎంతో కొంత ఇస్తారు. మీతో మాట్లాడుతూనే మీ సోషల్‌మీడియా ఫుట్‌ప్రింట్ గురించి ఆరా తీస్తారు. మీ వ్యక్తిగత సమాచారం సేకరిస్తారు. పెట్టుబడి పెడితే ఇంతకు పదింతలు సంపాదిస్తావ్ అంటూ ప్రలోభపెడతారు. మరోవైపు నకిలీ గ్రూప్ సభ్యులు మేం రూ.లక్ష సంపాదించాం, రూ. కోటి సంపాదించాం... అంటూ వీడియోలు, స్క్రీన్‌షాట్‌లు పెడుతూ నిరంతరం మిమ్మల్ని డబ్బులు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు. చాలామంది గృహిణులు నేను చదువుకున్నాను, ఖాళీగా ఎందుకు ఉండాలి, భర్త దగ్గర తనని తాను నిరూపించుకోవాలని సైబర్ నేరగాళ్లకి తేలిగ్గా దొరుకుతుంటారు.

ఈ మధ్యకాలంలో పోలీసుల మంటూ ఫోన్ చేస్తున్నారు. మీరు ఫోన్‌లో చూడకూడని కంటెంట్ చూస్తున్నారంటూ బెదిరిస్తారు. అది ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం కాబట్టి భయపడి డబ్బులు పంపుతూ ఉంటారు.

ఒంటరి మహిళలకు ఎదురయ్యే మోసాలు కూడా కొన్నుంటాయి. ఎన్నారైనంటూ మాట కలుపుతారు. 'తిన్నావా, పడుకున్నావా?', 'బుజ్జీ, బంగారం' అంటూ ఎమోషనల్‌గా మాట్లాడతారు. చివరికి పెళ్లి చేసుకుందాం అంటారు. ఆలోపు ఓ చిరు కానుక అంటూ ఓ ఉంగరం, నెక్లెస్ పంపిస్తున్నా అంటారు. వాటి ఫొటోలు, వీడియోలు కూడా పెడతారు. ఆ తరవాత వాటిని విడిపించుకోవాలంటే డబ్బులు కట్టాలంటూ మెసేజ్‌లు వస్తుంటాయి. ఇదొక రకం కొరియర్ మోసం అన్నమాట. సరే లక్షల రూపాయల బంగారం కదా... వేలు కడితే తప్పేంటి అనుకొని అమాయక మహిళలు డబ్బులు కడుతూ ఉంటారు. అలా లక్షలు లక్షలు కట్టిన తరవాత అవతలి వ్యక్తి ఫోన్ తీయడు.

మరి దీనికి పరిష్కారం అంటే... కొత్త, తెలియని లింక్‌లు ఓపెన్ చేయొద్దు. ఉచితంగా, సులభంగా డబ్బులు వస్తున్నాయంటే ఆలోచించాల్సిందే. పెట్టుబడి, అధిక రాబడి అనే మాటలు అసలు నమ్మొద్దు. అలాగే సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లని కూడా గుడ్డిగా నమ్మొద్దు. చాలామంది వాళ్ల కారణంగానే మోసపోతున్నారు.

ఇప్పుడు టాప్ ట్రెండింగ్‌లో ఉన్న క్రైమ్‌లో ఈ పార్ట్‌టైమ్ జాబ్ వర్క్ ఒకటి. ఇంట్లో కూర్చునే పనిచేయొచ్చు అంటారు. యూట్యూబ్ వీడియోలకి లైక్ చేస్తే చాలు అంటారు. ఏ పేరున్న సంస్థ అలాంటి ఉద్యోగాలు ఇవ్వదు. అందుకే ఈజీ మనీని ఆశగా చూపించే ఏ గ్రూపులోనూ చేరొద్దు.

**అనిల్ రాచమల్ల, సైబర్ నిపుణులు, ఎండ్‌నౌ ఫౌండేషన్**

ఆపద్బాంధవి... 1930

ఈ నేరాలను అరికట్టేందుకు, బాధితులు పోగొట్టుకున్న మొత్తం సొమ్మును రాబట్టేందుకు పోలీసులు ప్రవేశపెట్టిందే... ఆపద్బాంధవి 1930. ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా క్షణాల్లో ఆ సమాచారం సైబర్ పోలీసులకు అందుతుంది. వారా డబ్బును ట్రాక్ చేసి, తరవాత బ్లాక్ చేసి తిరిగి మీకు దక్కేలా చేస్తారు.

# రిటర్నుల గడువు పెంచండి

## ఆర్థిక శాఖకు పెద్ద ఎత్తున వినతులు

## ఐసీఏఐ నుంచీ ప్రతిపాదనలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించేందుకు గడువు సమీపిస్తోంది. ఆదాయపు పన్ను చట్టం-1961 సెక్షన్ 139(1) ప్రకారం జులై 31లోగా ఆడిట్ అవసరంలేని వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, సంస్థలు తమ రిటర్నులు దాఖలు చేయాలి. ఇప్పటికే చాలామంది తమ రిటర్నులు దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆదాయపు పన్ను పోర్టల్‌లో తలెత్తుతున్న కొన్ని ఇబ్బందుల నేపథ్యంలో, ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురువుతున్నాయి. దీంతో రిటర్నుల గడువు పెంచాలని కోరుతూ పలువురు సామాజిక వేదికల ద్వారా ఆర్థిక మంత్రి, ఆదాయపు పన్ను విభాగానికీ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సైతం పన్ను విభాగానికి లేఖ రాసింది. ఇందులో ప్రస్తావించిన విషయాలను పరిశీలిస్తే... ఫారం 26ఏఎస్/ వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)/టీఐఎస్‌లలో ఆదాయం, ఇతర వివరాలకు సంబంధిన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక కారణాల వల్ల 26ఏఎస్/ఏఐఎస్‌లను తీసుకోవడం సాధ్యం కావడం లేదు. ఉమ్మడి ఖాతాలున్న వారికి ఆదాయాలు ఇద్దరి ఖాతాల్లోనూ కనిపిస్తున్నాయని, పరిశీలన సమయంలో ఇవి నోటీసులకు దారి తీయొచ్చని పేర్కొన్నారు.

ఏఐఎస్/టీఐఎస్‌లో ఉన్న సమాచారంపై మరింత వివరాలు సమర్పించేందుకు పరిమితంగానే సమాధానాలు అందుబాటులో ఉన్నాయి. పన్ను చెల్లింపుదారులు కచ్చితమైన సమాచారాన్ని తెలిపేందుకు వీలు కావడం లేదు. ఇతరాలను ఎంచుకుని, వివరంగా చెప్పేందుకు అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు వీలు కల్పించాలి. పన్ను చెల్లింపుదారులు తమ సమాధానాలను తెలియజేసినప్పటికీ, అవి 115లో సరిగా నమోదు కావడం లేదు.

ఆదాయపు పన్ను పోర్టల్‌లో పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి ప్రయత్నించినప్పుడు స్పందన సరిగా ఉండటం లేదు. కొన్నిసార్లు బఫరింగ్ అవుతూ ఇబ్బంది పెడుతోంది. డివిడెండ్ ఆదాయం, ఇతర ఆదాయాలకు సంబంధించిన వివరాలూ సరిగా నమోదైనట్లు కనిపించడం లేదని ఐసీఏఐ తెలిపింది.

**ఓటీపీలు సరిగా రావడం లేదు:** ఆదాయపు పన్ను రిటర్ను పూర్తి చేసేందుకు అవసరమైన ఓటీపీలు రావడం లేదని, ఆలస్యంగా వస్తున్నాయని పలువురు 'ఎక్స్' వేదికగా ఆదాయపు పన్ను శాఖ దృష్టికి తీసుకొస్తున్నారు. ఓటీపీలు రాకపోవడంతో పాస్‌వర్డ్ మార్చుకోవడం, రిటర్నులను ఇ-వెరిఫై చేయడంలో ఇబ్బందులు ఎదురువుతున్నాయని ఐసీఏఐ సైతం పేర్కొంది. రిటర్నులు దాఖలు చేసిన తర్వాత ఐటీఆర్ అక్నాలజ్‌మెంట్ సరిగా రావడంలేదని తెలిపింది.

**మరో నెల అవకాశమివ్వరూ:** ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు ఆదాయపు పన్ను పోర్టల్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. గతంతో పోలిస్తే రిటర్నుల దాఖలు ప్రక్రియ సులభంగా మారింది. కానీ, సాంకేతికత పెరుగుతున్న కొద్దీ, సమస్యలూ కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అదనంగా కనీసం నెల రోజుల గడువు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆదాయపు పన్ను విభాగాన్ని అభ్యర్థిస్తున్నారు.

# ఆ ఆటలంటేనే ఎంతో ఇష్టం!

**చిన్నప్పుడు స్కూల్లోనూ, సెలవునాడు వీధుల్లోనూ స్నేహితులతో కలిసి ఆటలాడిన జ్ఞాపకాలు ప్రతి ఒక్కరికీ ఉంటాయి. మళ్లీ మళ్లీ తిరిగిరాని అలాంటి అనుభూతులు తమకూ ఉన్నాయని చెబుతున్న ఈ ప్రముఖులు- ఆటల నుంచి ఏం నేర్చుకున్నారో తెలుసా!**




### నేనే కెప్టెన్

**- నరేంద్ర మోదీ**

మా స్కూల్‌లో ఆటల్ని ఎక్కువగా ప్రోత్సహించేవారు. తరచూ ఏవో ఒక పోటీలు పెట్టేవాళ్లు. నాకు మాత్రం కబడ్డీ అంటే చాలా ఇష్టం. రోజూ సాయంత్రం పూట స్నేహితులతో కలిసి ఆడేవాణ్ని. కొన్నాళ్లకి నేనే స్కూలు కబడ్డీ జట్టుకు

కెప్టెన్‌ను అయ్యా. అందుకని అందర్నీ కలుపుకుని వెళుతూ ఒక్క మాట మీద ఉండేలా చూస్తూ రోజూ కబడ్డీ సాధన చేసేవాణ్ని. ఆటల్లో పడి ఒక్కోరోజు చీకటి పడే వరకూ ఇంటికి కూడా వెళ్లేవాణ్ని కాదు. ఎప్పుడూ ఆట ధ్యాసలోనే ఉండేవాణ్ని. ఒకరకంగా కబడ్డీ ఆట నాకు నాయకత్వ లక్షణాలను నేర్పిందనే చెప్పాలి.

### సరదా కాదు బంధం

**- కమల్‌హాసన్**

నాకు ఇంట్లో కూర్చుని ఆడుకోవడం అంటే అస్సలు నచ్చేది కాదు. ఎప్పుడూ బయటకు వెళ్లి స్నేహితులతో హాకీ, క్రికెట్ ఆడేవాడిని. అవనే కాదు ఎక్కువ మందితో కలిసి జట్టుగా ఆడే ఆటలే నాకు నచ్చేవి. ఎందుకంటే అలాంటి ఆటల వల్ల ఎప్పుడూ నా చుట్టూ ఫ్రెండ్స్ ఉండేవాళ్లు. జట్టులో ఎవరైనా తక్కువ అయితే కొత్త వాళ్లని పరిచయం చేసుకుని ఆటలో చేర్చుకోవడం, వాళ్లతో స్నేహం చేయడం భలేగా ఉండేది. అలానే టీమ్‌లో ఒకరికి కష్టమంటే మిగతా అందరం స్పందించి సాయం చేసేవాళ్లం. నా దృష్టిలో ఆటలంటే కేవలం సరదా వ్యాపకం కాదు, స్నేహ బంధాలను పెంపొందించేవి కూడా.

### స్నేహితులకు నేర్పించా

**- రతన్ టాటా**

ఇప్పుడంటే వయసు మీద పడి తెరమీద మాత్రమే క్రీడలు చూస్తున్నా. బాగా రాణించిన క్రీడాకారులతో మాట్లాడి అభినందనలు తెలియజేస్తున్నా. టాటా సంస్థల తరపున చెస్ టోర్నమెంట్‌లు కూడా నిర్వహించి ఔత్సాహికుల్ని ప్రోత్సహిస్తున్నా. ఎందుకంటే నాకు చెస్ అంటే చాలా ఇష్టం. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ మెదడుకు పదును పెట్టుకునే ఆ ఆట గురించి ఒకసారి స్కూల్లో టీచర్ చెప్పారు. దాంతో చెస్‌ను ఇష్టంగా నేర్చుకున్న నేను సెలవు రోజుల్లో ఆడేవాణ్ని. మొదట్లో నా స్నేహితులకి చెస్ వచ్చేది కాదు. దాంతో అందరికీ ఓపిగ్గా నేర్పించి- వాళ్లని నాతో పోటీ పడమనేవాణ్ని. వ్యాపారంలోకి వచ్చాక ఒత్తిడిగా అనిపించినప్పుడు చెస్ ఆడి.. ఆ భారాన్ని దింపుకునేవాణ్ని. ఈ మధ్య ఆడటం కుదరట్లేదుగానీ చెస్ టోర్నమెంట్లకు సంబంధించిన వీడియోలు మాత్రం చూస్తుంటా.

### పరుగులో విజేతని

**- సుందర్ పిచాయ్**

చిన్నప్పుడు చదువుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించేవాణ్ని. క్రికెట్ అంటే చాలా ఇష్టముండేది కానీ ఎప్పుడో ఒకసారి మాత్రమే స్నేహితులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడేవాణ్ని. ఎక్కువగా టీవీలోనే మ్యాచ్‌లు చూసి ఆనందించేవాణ్ని. స్కూల్లో పోటీలు పెడితే మాత్రం రన్నింగ్ రేసులో పాల్గొనేవాణ్ని. సన్నగా ఉండటంతో వేగంగా పరిగెత్తి బహుమతులు గెలుచుకునేవాణ్ని. అలానే మా నాన్న రోజూ ఇంటికి ఇంగ్లిష్ పేపరు తెప్పించేవారు. ఒకసారి పజిల్ నింపుతూ 'ఇవి పూర్తి చేస్తే మెదడు చురుగ్గా తయారవుతుంది' అని చెప్పారు. ఇక ఇంటర్ పూర్తయ్యేవరకూ రోజూ న్యూస్‌పేపర్లో వచ్చే పజిళ్లు పూర్తి చేశా. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక ఫుట్‌బాల్‌కి సంబంధించిన వీడియో గేముల్ని ఆడటం మొదలుపెట్టా. ఇప్పటికీ అవంటే నాకు చాలా ఇష్టం. సమయం దొరికితే వీడియో గేములు ఆడుతుంటా.

### అమ్మ చెప్పింది

**- ఆనంద్ మహీంద్ర**

నాకు ఆటలంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు చదువుకంటే వాటికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవాణ్ని. శారీరక సామర్థ్యం కోసం ఆడుకోమని టీచర్లూ ప్రోత్సహించేవారు. ప్రతిరోజూ స్కూలు గ్రౌండ్‌లో స్నేహితులతో పోటీపడి ఆడేవాడిని. రన్నింగ్ రేసులో పాల్గొనేవాడిని. ఇంట్లో ఉంటే మాత్రం వైకుంఠపాళి ముందేసుకుని కూర్చునేవాణ్ని. చెల్లెళ్లతో కలిసి ఆడుతుంటే సమయం తెలిసేది కాదు. ఒకసారి ఆ ఆటను నేర్పిస్తూ 'మంచి అలవాట్లు ఉన్నవారెవరైనా విజయమనే నిచ్చెన ఎక్కగలుగుతారు. అదే చెడు మార్గంలో వెళితే పాము మింగేసి మనల్ని పాతాళానికి తోసేస్తుంది' అని అమ్మ చెప్పింది. ఆ మాటలు విన్న నేను మంచి అలవాట్లను అలవరచుకున్నా. సమయం దొరికితే వైకుంఠపాళి ఆడేవాణ్ణి. అది మానసికోల్లాసాన్ని పంచడంతోపాటు- మనం పడిపోయినప్పుడు పట్టుదలతో ప్రయత్నిస్తే మళ్లీ ఉన్నతస్థాయికి ఎదగగలమని చెప్పకనే చెబుతుంది.

# అప్పుడేమో ఆ కేంద్రంలో ఆరుగురికి ఫస్ట్ ర్యాంక్.. నీట్ రీ-టెస్ట్ తర్వాత..?

**హైదరాబాద్ పెన్ పవర్:** నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాలు చోటుచేసుకోవడం తీవ్ర దుమారం రేపింది. ఈక్రమంలోనే గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మళ్లీ పరీక్ష నిర్వహించారు. సుప్రీం విచారణలో భాగంగా నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా నీట్-యూజీ ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) శనివారం వెల్లడించింది. ఆ డేటా ప్రకారం..



జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు వచ్చాయి. ఆ ఫలితాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం ఆ పరిస్థితికి దారితీసిందని గుర్తించిన సుప్రీం.. వారికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. వారిలో 813 మంది మాత్రమే హాజరయ్యారు. ఫలితాల అనంతరం సదరు కేంద్రంలో వచ్చిన అత్యధిక స్కోరు 682గా ఉండటం గమనార్హం. అది కూడా ఒక్క విద్యార్థికే వచ్చింది. 13 మంది విద్యార్థులకు 600 పైగా మార్కులు వచ్చాయి. తొలుత వెల్లడైన ఫలితాలకు వీటికి మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది.

ఇదిలా ఉంటే.. రీటెస్ట్ తర్వాత నీట్ యూజీ పరీక్ష రాసిన అందరి ర్యాంకులు మారినట్లు ఫలితాల తర్వాత ఎన్‌టీఏ వెల్లడించింది. ఇదిలాఉండగా.. నీట్ పరీక్షలో పేపర్ లీక్ జరిగిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. మరోపక్క ఈ అవకతవకలపై సుప్రీంలో విచారణ

జరుగుతోంది. ఈ క్రమంలోనే విచారణలో భాగంగా మిగతా కేంద్రాలతో పోలిస్తే అనుమానిత పరీక్ష కేంద్రాల్లో రాసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చాయా.. లేదా అని తెలుసుకోవడానికి కేంద్రాల వారీగా ఫలితాలు అందించాలని కోర్టు ఎన్టీఏను ఆదేశించింది. ఫలితాలను ఎన్టీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అయితే విద్యార్థుల గుర్తింపు బయటపడకుండా చూడాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే 5న నీట్ యూజీ పరీక్ష జరిగింది. 571 నగరాల్లోని 4,750 సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 24 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇందులో 14 కేంద్రాలు విదేశాల్లో ఉన్నాయి